మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డికె అరుణ
- జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ జి.మమత, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, మహిళా అధికారులు
- హెచ్‌పివి టీకా పోస్టర్ ఆవిష్కరణ
- ఉత్తమ సేవలు అందించిన వారికి ఘన సన్మానం

వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళలను సన్మానిస్తున్న కలెక్టర్, ఎంపి

ఎంపీ డీకే అరుణకు కేక్ తినిపిస్తున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి7 ప్రభాతవార్త: మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మహబూబ్‌నగర్ ఎంపి డికెఅరుణ. అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపి డికె.అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి డికె అరుణ మాట్లాడుతూ మహిళలు చాలా సందర్భాల్లో కుటుంబం, ఉద్యోగ బాధ్యతల కారణంగా తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, వృత్తి జీవితాన్ని సమతుల్యంగా నిర్వహించగలరని తెలిపారు. అందువల్ల మహిళలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మహిళలను ప్రమాదకరమైన గర్భాశయ క్యాన్సర్ నుంచి రక్షించేందుకు 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గ్రుల బాలికలకు ఉచిత హెచ్‌పీవి టీకాను కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నదని తెలిపారు. ఈ టీకా తీసుకునేలా మహిళలు, మీడియా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపి కోరారు. అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలసభ్యులకు స్థానికంగా చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా రుణాలు అందిస్తున్నదని తెలిపారు. దేశంలో మూడు కోట్ల మహిళ సంఘాల సభ్యులను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ వికసిత భారత్ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్య పదవులు చాలావరకు మహిళల చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా న్యాయమూర్తి, జిల్లా సంక్షేమాధికారి వంటి కీలక పదవుల్లో మహిళలు ఉన్నారని, తాను కూడా మహబూబ్‌నగర్ ఎంపీగా మహిళేనని పేర్కొన్నారు. అందువల్ల మహిళలు ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహిళలు తమ శక్తి సామర్థ్యాలు గుర్తించి తమ తమ రంగాల్లో రాణించాలని అన్నారు. మహిళలందరికీ కలెక్టర్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలనిసూచించారు. మహిళల్లో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉన్నాయని, మంచి పోషకాహారం తీసుకోవాలని, మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. కుటుంబం ఉద్యోగ జీవితంలో ఒకరికి ఒకరు సహకరించుకుంటేనే మహిళలు విజయాన్ని సాధించగలరని అన్నారు. ప్రతి మహిళ తోటి మహిళకు సహకారం అందించాలని అన్నారు తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నదని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలందరికీ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా డిఎంహెచ్‌ఓ, డిఆర్‌డిఏ, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులకు ఆమె సూచించారు. మహబూబ్‌నగర్ మేయర్ జి.మమత మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై -మిగతా4లో..

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లు

- కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్

కల్వకుర్తి, మార్చి 7 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతి కుటుంబానికి అందుతాయని కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ తెలిపారు. శనివారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటి పనులను స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్‌లతో కలిసి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి గడపకు అందేటట్లు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రామరాజు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు రమేష్ నాయక్, రవిగౌడ్, నాయకులు సతీష్, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, వార్డు ఆఫీసర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు గట్టు బ్లాక్ ఎంపిక

గద్వాల జిల్లాకు గర్వకారణమం : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

గద్వాల మార్చి7, ప్రభాతవార్త: నీతి ఆయోగ్ నిర్వహించనున్న ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు జోగులాంబ గద్వాల జిల్లా గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నీతి అయోగ్ ఆస్పిరేషనల్ బ్లాక్స్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా ఎంపికైన వివిధ జిల్లాల్లో నిర్దేశిత అంశాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పద్ధతులను గుర్తించి ఇతర ప్రాంతాల ప్రతినిధులతో వాటిని పంచుకునేందుకు ఈనెల తొమ్మిదిన విశాఖపట్నంలో నీతి ఆయోగ్ ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం-3 పరిధిలో మొత్తం ఆరు రాష్ట్రాలు పాల్గొంటున్నాయని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జోగులాంబ గద్వాల మరియు నిర్మల్ జిల్లాలు మాత్రమే ఎంపిక కావడం విశేషమన్నారు. ఇతర జిల్లాల నుంచి అనేక ప్రతిపాదనలు వచ్చినప్పటికీ గట్టుబ్లాక్‌లో విద్యా రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి సెమినార్లో తెలియజేసేందుకు గట్టు బ్లాక్ ఎంపిక కావడం జిల్లాకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంలో జరిగే ఈ సెమినార్‌లో గట్టు బ్లాక్‌లో విద్యారంగం సాధించిన ప్రగతిపై ఇతర రాష్ట్రాలతో పంచుకునేందుకు అవకాశం కలిగిందని తెలిపారు. ఈ సెమినార్‌లో జోగులాంబ గద్వాల్ జిల్లా తరఫున జిల్లా కలెక్టర్ గా తాను పాల్గొని గట్టు బ్లాక్‌లో విద్యారంగంలో అమలు చేస్తున్న కార్యక్రమంపై ప్రెజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లాలో వెనుకబడిన గట్టు మండలంలో గతంలో విద్యా రంగంలో తక్కువ అక్షరాస్యత, సీడ్ పత్తి క్రాసింగ్ సమయంలో విద్యార్థుల సీజనల్ డ్రాప్‌అవుట్స్, పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత, తక్కువ ఫలితాలు వంటి సమస్యలు ప్రధానంగా ఉండేవని తెలిపారు. ఈ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి వ్యూహాత్మక చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. గట్టు బ్లాక్‌లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి గత రెండు సంవత్సరాల్లో విద్యా వాలంటీర్ల నియామకం, సాయంత్రం ప్రత్యేక తరగతులు, మాదిరి పరీక్షల నిర్వహణ, తదితర కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. పత్తికోత సమయంలో పిల్లలు పనికి వెళ్లకుండా గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో బాల కార్మికవ్యవస్థ నిరోధక చర్యలు చేపటినట్లు వివరించారు. 9వ-12వ తరగతి విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్, ప్రేరణాత్మక కార్యక్రమాలు, డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలకు తీసుకురావడానికి గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కలిపించినట్లు తెలిపారు. భవిష్య భారత్, టీచ్‌ఫర్ చేంజ్, ఎంవీ ఫౌండేషన్, తదితర స్వచ్ఛంద -మిగతా4లో..

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

బీఈడీ కళాశాల అభివృద్ధి బాధ్యత నాది

ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 7 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ నగరంలోని బీఈడి కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డేకార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని, అందువల్ల విద్యార్థులు తమ చదువులో నిబద్ధతతో ముందుకు సాగాలని సూచించారు. అదేవిధంగా, బీఈడి కళాశాల అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. కళాశాలకు కొత్త భవనం నిర్మాణంతో పాటు అధునాతన సదుపాయాలతో కూడిన సరికొత్త లైబ్రరీని అందుబాటులోకి తీసుకు రావడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు మెరుగైన విద్యను పొందేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర కాలంలోనే ఈ కళాశాల నుంచి ఎంతో మంది ఉపాధ్యాయులు తయారై రాష్ట్ర వ్యాప్తంగా సేవలందిస్తున్నారని, ఈ కళాశాలకు గొప్పచరిత్ర ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ నేటి విద్యార్థులు కూడా ఉత్తమ ఉపాధ్యాయులుగాఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు. త్వరలో డిఎస్సీ జరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ ఎస్ శేఖర్, నాయకులులీడర్ రఘు, కళాశాల పర్యవేక్షకులు కె.రామకృష్ణరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

60 రోజులకు మించి పెండింగ్ ఉండొద్దు

ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి : రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ

కేక్ కట్ చేస్తున్న అదనపు కలెక్టర్ హరిప్రియ

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 7 ప్రభాతవార్త: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సంబంధిత ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరి ప్రియ శనివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు, భూభారతి, భూ సర్వేలు, భూ ఆక్రమణలు, అసైన్డ్ భూములు, జాతీయ రహదారి విస్తరణ కోసం భూ స్వాధీనం, ప్రభుత్వ సంస్థలకు భూముల కేటాయింపు వంటి అంశాలకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఏ తహసీల్దారు వద్ద కూడా 60రోజులకు పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రస్తుతం ఉన్న పెండింగ్ ఫైళ్లను వచ్చే ఒక వారంలోపు క్లియర్ చేయాలని ఆమె ఆదేశించారు. అలాగే జాతీయ కుటుంబ లాభ పథకం (NFBS) కింద పరిహారం అందించేందుకు అర్హులైన కుటుంబాల నుంచి ప్రతిపాదనలు పంపించాలని తహసీల్దార్లను కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పథకం కింద ప్రతిపాదనలు చాలా తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా బీపీఎల్ కుటుంబంలో మరణించిన వ్యక్తి కుటుంబానికి ఒకసారి ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. ఒంటరి మహిళలు, విధవుల పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం -మిగతా4లో..

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- పరిశుభ్రత కోసం మనమందరం నడుం బిగించాలి
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ
- ఎకో పార్క్ పరిసరాల్లో శ్రమదానం చేసిన జిల్లా కలెక్టర్

శ్రమదానం చేస్తున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, మార్చి 7 ప్రభాతవార్త: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని, కాబట్టి "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ"లో భాగంగా ప్రతి ఒక్కరు పరిశుభ్రత కోసం నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా వనపర్తి పట్టణంలోని ఎకో పార్క్ సమీపంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని స్వయంగా శ్రమదానం చేసి పార్క్ పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్ తట్టలు పట్టుకొని చెత్తను పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత ద్వారా అనేక రకాల సీజనల్ వ్యాధులను నివారించవచ్చని అన్నారు. పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు కూడా ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని స్వచ్ఛమైన పరిసరాల నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డిపిఆర్ఓ సీతారాం, సిపిఓ హరికృష్ణ, డివైఎస్ఓ సుధీర్ రెడ్డి, జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి విద్యా రంగానికి రాష్ట్రంలో గుర్తింపు

- పీఎం పోషణ్ పథకం అమలులో 95 మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానం
- ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఎల్పిజి గ్యాస్ కనెక్షన్
- సీఎం సమక్షంలో జిల్లా కలెక్టర్‌కు అభినందనలు

వనపర్తి, మార్చి7 ప్రభాతవార్త: జిల్లా అభివృద్ధికి దూరదృష్టి, పరిపాలనలో కట్టుదిట్టమైన అమలు ఉంటే ఫలితాలు ఎలా ఉంటాయో వనపర్తి జిల్లా మరోసారి నిరూపించింది. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నాయకత్వంలో విద్యారంగంలోఅమలు చేస్తున్న సంస్కరణలు, పర్యవేక్షణ ఫలితంగా వనపర్తి జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ముఖ్యంగా మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యాశాఖ పనితీరు సూచికల్లో జిల్లాకు వచ్చిన ఈ విజయాలు, కలెక్టర్ ఆదర్శ్ సురభి సమర్థ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచాయి. వనపర్తి జిల్లా విద్యా రంగంలో మరోసారి తన సత్తా చాటుకుంది. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నాయకత్వంలో విద్యా కార్యక్రమాల అమలులో వనపర్తి జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానాలు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ విజయాలకు గుర్తింపుగా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన కలెక్టర్ల సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. కేంద్ర ప్రభుత్వ పీఎం పోషన్ స్కీం (మధ్యాహ్న భోజన పథకం) అమలులో వనపర్తి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ పథకంలో మొత్తం 18 కాంపోనెంట్లకు 100 మార్కులు కేటాయించగా, వనపర్తి జిల్లా 95 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఎల్పీజీ గ్యాస్ సౌకర్యం కల్పించడంలో వనపర్తి జిల్లా పూర్తి స్థాయిలో విజయాన్ని సాధించింది. ఈ విభాగంలో పదికి పది మార్కులు సాధించడం విశేషం. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రత్యేక చొరవతో ప్రతి పాఠశాలలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు ఏర్పాటు చేయించడం వల్ల మధ్యాహ్న భోజన పథకం అమలు మరింత మెరుగుపడింది. దీనివల్ల విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైనభోజనం అందించడంలో పెద్ద ఎత్తున సహాయపడుతోంది. విద్యాశాఖ పనితీరు సూచికల్లో వనపర్తి జిల్లాకు ద్వితీయ స్థానం ద్వితీయ స్థానంవిద్యాశాఖ పనితీరు సూచికల్లో కూడా వనపర్తి జిల్లా మంచి ప్రతిభ కనబరిచింది. జిల్లాల వారీగా జనవరి నెలకు సంబంధించి సమీక్షలో వనపర్తి జిల్లా ద్వితీయ స్థానం సాధించింది. అపార్ జనరేషన్, ఆధార్ వెరిఫికేషన్, డీఈఓ విజిట్స్, విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్, ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వంటి ఐదు అంశాలలో 50 మార్కులకు గాను 34.4 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ -మిగతా4లో..

మహిళా చైతన్యంతోనే సమాజలో మార్పు

- మాజీ జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి

ఎమ్మెల్యే సతీమణి కవితను సన్మానిస్తున్న మహిళ ఉద్యోగులు

చిన్నచింతకుంట, మార్చి7 ప్రభాతవార్త: మహిళల చైతన్యంతోనే సమాజంలో మార్పు సాధ్యమని మాజీ జడ్పీ చైర్పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మండల వనరుల భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభనుఏర్పాటు చేశారు. ఈ సభకు ఎంఈఓ మురళీ కృష్ణ అధ్యక్షత వహించగా మాజీ జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి జి .కవిత మధుసూదన్ రెడ్డిలు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు ఫని ఇండోర్ గేమ్స్ నిర్వహించి ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారతకు ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ధైర్యంగా నిలబడి అంతర్జాతీయ స్థాయిలో రాణించి పురుషులకు సమానంగా మహిళలు రాణిస్తున్నారని రుజువు చేయాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చట్టాలనుతీసుకురావాలన్నారు. నేటి సమాజంలో మహిళలపై అఘాత్యాలు పెరిగిపోయాయని వాటిని అరికట్టాలని తెలిపారు. మహిళలు చైతన్యవంతులుగా ఉండి తల్లిగా, భార్యగా, అక్కగా, చెల్లిగా, కూతురుగా, గురువుగా బాధ్యతలు నిర్వహిస్తూనే సమాజంలో ఆదర్శవంతులుగా ఉండాలని వారు తెలిపారు. మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలను వారు తెలిపారు. మహిళల యొక్క విశిష్టతను గొప్పదనాన్ని చట్టాలపై మహిళా ఉద్యోగులు వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అతిథులకు మహిళా ఉద్యోగులను ఘనంగా సన్మానించి దేశంలో మహిళలు గౌరవప్రదంగా ఉండాలని ఎంఈఓ మురళి కృష్ణ తెలిపారు. అల్లిపూర్, బండర్ పల్లి పాఠశాలల హెచ్ఎంలు పర్వీన్ బేగం, ఉమాదేవిలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సిలు విజయసింహ, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

లక్ష్యంతో కృషి చేస్తేనే విజయాలు సాధ్యం

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

నడింపల్లి హైస్కూల్‌లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉప్పునుంతల, మార్చి 7 ప్రభాతవార్త: ఉన్నత లక్ష్యంతో కష్టపడి చదువు తేనే జీవితంలో విజయాలు సాధ్యమవుతాయని టిపిసిసి ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట మండలం నడింపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం బెస్ట్ రన్నర్స్ కమ్యూనిటీఎడ్యుకేషన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అంతకుముందు నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు జరుపుకున్న స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు జరుపుకుంటున్న కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తిలకించారు. విద్యార్థులు నిర్వహిస్తున్న స్వయం పరిపాలన దినోత్సవంపట్ల ఆయన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అభివృద్ధికి భాగస్వాములు కావడం అభినందనీయమని, పాఠశాల విద్యార్థులకు అందించిన సైకిళ్ల ను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందించేందుకు సులభంగా ఎంచుకున్న ప్రయోగాలు ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, మాజీ ఎంపిపి రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శారదమ్మ, హై స్కూల్ అర్జునయ్య, సంస్థ నిర్వాహకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఉండాలి : జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి7 ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి జిల్లా పోలీస్ శాఖ తరపున జిల్లా లోని మహిళలందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు గౌరవం, సమాన హక్కులు అవకాశాలు లభించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధించగలదని పేర్కొన్నారు. నేటి మహిళలు విద్య, ఉద్యోగం, వ్యాపారం, క్రీడలు, రాజకీయాలు వంటి అనేక రంగాల్లో తమ ప్రతిభను నిరూపిస్తూ సమాజ పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలు తమ ఆత్మవిశ్వాసం, పట్టుదల సంకల్పంతో ముందుకు సాగితే దేశ అభివృద్ధిలో మరింత భాగస్వాములు అవుతారని అన్నారు. మహిళల భద్రత రక్షణ విషయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాలను అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా మహిళలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, వారి ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీస్‌శాఖ సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. మహిళల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు గ్రామాల్లో షీ టీమ్స్, కళాజాత బృందాల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు ప్రతి మహిళ ధైర్యంగా ముందుకు సాగుతూతన లక్ష్యాలను సాధించాలని జిల్లా ఎస్పీ డి.జానకి పిలుపునిచ్చారు.

ప్రగతి పథంలో మహిళలు

- ఆవనిలో ఆమనికి సగం కష్టాలు
- మహిళలకు రాజకీయ రంగంలో సమాన హక్కులు కల్పించాలి
- మహిళలకు రక్షణ కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలి
- నేడు మహిళా అంతర్జాతీయ దినోత్సవం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి7, ప్రభాతవార్త: ఇంటికి దీపం ఇల్లాలు.. కుటుంబంలో అమ్మగా, అక్కగా, చెల్లిగా ఇలా ఎన్నో రూపాల్లో ఇంట్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటుంది. నాన్నకు గారాలపట్టి, అమ్మకు ఇంటి పనుల్లో చేదోడుగా, అన్నకు సహాయకురాలిగా, తమ్ముడికి మార్గ నిర్దేశకురాలిగా, చెల్లికి అక్కకు సహచరులుగా అందరిని తనవాళ్లుగా భావించి వారి సంతోషం కోసం నిస్వార్ధంగా కష్టపడేదే ఉత్తమురాలు మహిళ. అనాదిగా సంప్రదాయ ముసుగులో మహిళను అణిచివేస్తున్న ఆత్మవిశ్వాసంతో తనకుంటూ ప్రత్యేక స్థానం సమాజంలో ఏర్పరుచుకున్న వీరవనిత. నేడు మహిళలు అన్ని రంగాల్లోను దూసుకుపోతున్నారు. కూలీ పనులనుంచి కార్పొరేట్ రంగాల వరకు మహిళలు విస్తరించారు. అణు ఆయుధాల తయారీ నుంచి అంతరిక్షయానం వరకు ప్రతిభా సంపత్తులను ప్రదర్శిస్తూ... అవనిలో అబ్బురకర ప్రభంజనాన్ని ప్రతిష్టిస్తూ తమదైన బాణి, వాణి తమదైన రీతిలో ఆవిష్కరిస్తున్నారు. అయినా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు ప్రతిపాదనకు రిక్తహస్తాలే మిగులుతున్నాయి. ఏ పార్టీనైనా గెలుపు బాటలో నడిపించి పదవుల పట్టాభిషేకం చేసే సత్తా ఒక్క మహిళా లోకానికే ఉన్నదని అన్ని పార్టీలు అంగీకరిస్తున్న సత్యం.

ప్రత్యేకంగా రాజకీయంగా మహిళలు ఎదగకపోవడానికి కారణాలు అనేకం ఉన్న ప్రధానంగా ఆర్థిక స్వావలంబన అడ్డుగా నిలుస్తోంది. ఆర్థిక స్వావలంబనయే మహిళా అభ్యున్నతికి బాటలు వేస్తోంది. గతంలో విద్య, ఉద్యోగ రంగాల్లో వివక్షత చూపడం ద్వారానే మగువలు ఆయా రంగాల్లో రాణించలేకపోయారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. పురుషాధిక్యతకు తెరవేస్తూ నేటి స్త్రీలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతూ ముందుకు వెళ్తున్నారు. కానీ రాజకీయ రంగంలో మాత్రం వీరు ఆశించినంతగా అవకాశాలు రావడం లేదన్నది అక్షరసత్యం. పురుషులతో సమానంగా మహిళలకు, రాజకీయ రంగంలో అవకాశాలు కల్పించాల్సి ఉంది. సమానత్వం ఇవ్వడం ద్వారా తమ నైపుణ్యాన్ని వ్యక్తపరచుకునే అవకాశం వారికి కలుగుతుంది. రాజకీయ రంగంలో రిజర్వేషన్లు మహిళలకు హక్కుగా రూపొందాలి. అప్పుడే మహిళలు చైతన్యవంతులుగా రూపొందే ఆస్కారం ఉంటుంది. మహిళలకు వివిధ రంగాల్లో ప్రాధాన్యమిస్తున్న విధంగా రాజకీయ రంగంలోనూన సమాన అవకాశాలు కల్పించాలి. ప్రస్తుత తరుణంలో రాజకీయ చైతన్యం మహిళల్లో వెల్లివెరుస్తోంది. తమకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వెళ్లే నారీ లోకాన్ని ముందుకు అన్ని పార్టీలు ప్రోత్సహించాల్సి ఉంది. తగినంత సఖ్యలో పార్లమెంట్, అసెంబ్లీలో ఉంటే పార్లమెంటరీ విధానాల్లో కూడా అనేక మార్పులు వస్తాయి. ఇదే మాట మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా చెప్పారు. మహిళలు కోరుతున్నట్లుగా వారికి చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తే వాళ్ల పార్లమెంటరీ విధానాల్లో చక్కటి సంస్కరణలను తీసుకు రాగాలరన్నది నా నమ్మకం అని కళాశాల విద్యార్థినులనుద్దేశించి అబ్దుల్ కలాం అన్న మాటలివి. ఆత్మ విశ్వాసం, పట్టుదలకు ప్రతిరూపాలున్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తే తమ నాయకత్వాన్ని రుజువు చేస్తోంది. స్త్రీమూర్తులు సామాజిక ప్రగతిలో తమ వంతు బాధ్యత పోషిస్తున్నారు. ఈ తరుణంలో మహిళాసాధికారతను కల్పించాల్సి ఉంది. మహిళలకుఎక్కువఅవకాశాలు ఇవ్వడం ద్వారావారినిరాజకీయ రంగంలోముందుకు తీసుకుపోయే అవకాశం కలుగుతంది.

రాజకీయ రంగంలో రిజర్వేషన్లు మహిళలకు హక్కుగా రూపొందించాలి: కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బ్యాంగి రత్నమాల ఆనంద్‌కుమార్

రాజకీయ రంగంలో రిజర్వేషన్లు మహిళలకు హక్కుగా రూపొందాలి. అప్పుడే మహిళలు చైతన్యవంతులుగా రూపొందే ఆస్కారం ఉంటుంది. మహిళలకు వివిధ రంగాల్లో ప్రాధాన్యమిస్తున్న విధంగా రాజకీయ రంగంలోనూన సమాన అవకాశాలు కల్పించాలి. ప్రస్తుత తరుణంలో రాజకీయ చైతన్యం మహిళల్లో వెల్లివెరుస్తోంది. ఆత్మ విశ్వాసం, పట్టుదలకు ప్రతి రూపాలున్న మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పిస్తే తమ నాయకత్వాన్ని రుజువు చేస్తోంది. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో కల్వకుర్తి మున్సి పల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కల్వకుర్తి మున్సిపల్ మొదటి మహిళా చైర్మన్‌గా ఎన్నిక కావడంచాలా సంతోషకరంగా ఉందన్నారు. కల్వకుర్తి మున్సిపాలిటిని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శమున్సిపాలిటిగా తీర్చిదిద్దుతా...నాకు అవకాశమిచ్చిన కల్వకుర్తి ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు.

కుటుంబం నుంచే స్వేచ్ఛ ప్రారంభం కావాలి : కుడుముల అస్మిత చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా స్వేచ్ఛగా వ్యవహరించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు నాభావన. మహిళలకు స్వేచ్ఛ కుటుంబం నుంచే ప్రారంభం కావాలి. తల్లిదండ్రులు ఆడపిల్లలను, మగపిల్లలను వేర్వేరుగా చూడటం మానేయాలి. ఆడ పిల్లలను భారంగా భావించి చిన్నతనంలోనే పెళ్లి చేసి పంపుతున్నారు. ఇది చట్టవిరుద్ధం. బాలికలు బాగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలి. ఆర్థికంగా స్థిరపడాలి. నాకు నా కుటుంబ నుంచే స్వేచ్ఛ లభించడం వల్ల కల్వకుర్తి మున్సిపాలిటి 15వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యాను. నాకు రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన 15వ వార్డు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాములు. 15వ వార్డు అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తా. ఇచ్చిన హామీలన్ని నేరవేరుస్తాను.

మహిళలకు సాధికారత కల్పించాలి: మూడావత్ పద్మ, పంచాయతీ కార్యదర్శి

ఆకాశంలో సగభాగం ఉన్న మహిళల స్థితగతుల్లో ఇప్పటి వరకు ఆశించిన మార్పు రాలేదు. అస మానత, అణిచివేత, దోపిడి వంటి ఎన్నో ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వీటన్నింటికి కారణం మహిళల హక్కులు, చట్టాలు సరిగా అమలు కాక పోవడమే. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగిన క్రమంలో మహిళలకు పూర్తి స్థాయిలో రక్షణ ఉంటుందని ఆశిస్తున్నాం. మహిళాభ్యుదయం జాతికి శుభోదయం అన్న విషయాన్ని గుర్తించాలి. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి స్త్రీ గౌరవింపబడాలి. నేటి మహిళలు ఎంతో చైతన్యవంతులని, అన్ని రంగాల్లో రాణించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎక్కడో మారుమూల గ్రామం మున్ననూరు గ్రామంలో నాన్న మూడావత్ లక్ష్మణ్, మూడావత్ కౌసల్య దంపతులకు ఐదుగురం ఆడబిడ్డలం. మాకు మా నాన్న ఎక్కడ లోటు లేకుండా ఉన్నత చదువులు చదివించి మా జీవితాలు చక్క దిద్దడానికి వారు ఎన్నో త్యాగాలు చేశారని తెలిపారు. పదర మండలం చెన్నంపల్లి గ్రామంలో ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాను.

మహిళలకు రక్షణ కల్పించాలి : పున్నమల్ల నిర్మల

నేటిసమాజంలో యువతులపై, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేం దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలి. గతంలో కొన్ని చోట్ల మహిళా దినోత్సవం రోజు కూడా మహిళలపై దాడులు జరిగిన సంఘటనలెన్నో. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ కల్పిం చిన రాజ్యాంగం ప్రకారం అన్ని హక్కులు మహిళలకు సమానంగా కల్పించాలి. నేటి తరుణంలో పురుషులకు ధీటుగా మహిళలు, యువతులు అన్ని రంగాల్లో రాణించాలి. మహిళలు ఒంటరిగా అర్ధరాత్రి తిరిగినప్పుడే మనకు నిజమైన స్వాతంత్రమని అన్నారు గాంధీజీ.. నేడు యువతులు, మహిళలకు బయటకు రావాలంటేనే భయంకరమైనవాతావరణం నెలకొంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు మహిళల పట్ల జరుగుతున్న దాడులపై కఠినమైన చట్టాలు తీసుకొచ్చి మహిళలకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వం ప్రకటించిన నోటిఫికేషన్ల కోసం సంసిద్ధమవుతున్నాను. నేను ప్రభుత్వ ఉద్యోగం సాధించి మహిళాల్లో మార్పు, వారిచట్టాలు, వారికి ఉన్న హక్కుల కోసం అన్ని విధాలుగా అవగాహన కల్పిస్తా.

నేడు అంతర్జాతీ యమహిళా దినోత్సవం

నర్వ, మార్చి7 ప్రభాతవార్త : మార్చి 8 మహిళలకు ప్రత్యేకమైన రోజు. ప్రతి సంవత్సరం మార్చి8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటారు. మహిళల సాధన, కృషి, విజయాలను గుర్తించి, లింగ సమానత్వం, హక్కులను హైలైట్ చేస్తారు. నేడు మహిళలు పురుషులతో సమానంగా పోటీపడుతూ అన్ని రంగాలలో దూసుకుపోతున్నారు. అయితే నేటికీ పురుషాధిక్యత ప్రపంచంలో మహిళలు తీవ్ర వివక్షను, వేధింపులను, దాడులను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒక పురుషుడు ఉన్నత శిఖరాలు ఎదగడానికి కుటుంబమూ, సమాజం కూడా తోడ్పడతాయి. కానీ మహిళలు మాత్రం పురుష ప్రపంచం నుంచి అడుగడుగునా వివక్ష, సవాళ్ళు ఎదుర్కొంటూ స్వశక్తితోనే ఎదగవలసివస్తోంది. నేటికీ చాలా ప్రాంతాలలో వారికి కనీసం కుటుంబ సభ్యులా తోడ్పాటు కూడాలభించడంలేదు. అనేక సమస్యలు, సవాళ్ళు ఎదుర్కొంటూ పైకి ఎదగాలని ప్రయత్నించే మహిళలకుఉద్యోగాలలో, మంత్రివర్గాలలో, చట్టసభలలో సముచిత స్థానంకోసం పోరాడవలసి వస్తోంది. మహిళల పట్ల వివక్షకు ఇది అద్దం పడుతోంది. అయినప్పటికీ మహిళలు ఎవరికివారు ఒంటరిపోరాటాలు చేస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకొంటున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న ఈ సమస్యలన్నిటికీ పరిష్కారాలు మహిళల చేతిలోనే ఉన్నాయనే సంగతి వారు గ్రహించకపోవడం వలననే అనాదిగా వారుఏటికి ఎదురీదవలసి వస్తోందని చెప్పక తప్పదు. యావత్ ప్రపంచానికి మొదటి గురువు తల్లే. ఆ తల్లి మార్గదర్శనంలోనేఎవరైనా ఈప్రపంచంలోకి అడుగుపెట్టాలి. కను కమహిళలకు సమానగౌరవం, సమానవకాశాలు కల్పించే విధంగా తమ పిల్లలకు బాల్యంనుంచే నేర్పించగలిగితే క్రమంగా సమాజ ప్రవర్తనలో, ఆలోచన తీరులో మార్పులు మొదలయ్యే అవకాశం ఉంటుంది.

రేషన్ కార్డు దారులు తప్పనిసరిగా ఈ కేవైసి చేయించుకోవాలి

నారాయణ పేట, మార్చి7 ప్రభాతవార్త : నారాయణ పేట జిల్లాలో ప్రభుత్వం ఇచ్చిన తాజా సూచనల మేరకు రేషన్ కార్డు దారులు అందరూ తప్పనిసరిగా ఈ కేవైసి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం నారాయణపేట జిల్లాలో ఈ కేవైసి చేయించుకున్న వారి శాతం 66.53 మాత్రమే ఉందని తెలిపారు. కావున రేషన్ కార్డులో ఉన్న ప్రతి సభ్యుడు కూడా తమకు సమీపంలోని రేషన్ దుకాణానికి వెళ్లి ఈ కేవైసి ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ కేవైసి చేయించుకోని పక్షంలో భవిష్యత్తులో రేషన్ సరఫరా పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అలాగే చాలా కాలం పాటు ఈ కేవైసిచేయించుకోకపోతే రేషన్ కార్డు రద్దు అయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు. అందువల్ల నారాయణపేట జిల్లా రేషన్ కార్డు లబ్ధిదారులు అందరూ సకాలంలో తమ రేషన్ కార్డు ఈ కేవైసి ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కోరారు.

సమాజంలో స్త్రీపాత్ర విశిష్టమైనది

- లక్ష్యాన్ని సాధించడంలో మహిళలది ప్రత్యేక స్థానం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

మహిళా కౌన్సిలర్లను సన్మానించిన దృశ్యం

వనపర్తి, మార్చి 7 ప్రభాతవార్త : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి మహిళా కౌన్సిలర్లను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిమాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర చాలా విశిష్టమైంది అని అన్నారు. కుటుంబ అభివృద్ధిలాగానే తమకు అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని మహి ళలు తమ ప్రతిభ చాటుకుంటున్నారని అన్నారు. అటువంటి మహిళలను గౌరవించడం మన సంస్కారాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించడం మన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సన్మానం పొందిన మహిళా కౌన్సిలర్స్ లో భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి, స్వాతి హరిబాబు, ఏర్వ అరుణ శ్రీనివాసులు, శిరీష రమేష్ గౌడ్, శంకరమ్మ బాబు నాయక్, అయేషా సిద్దిఖీ, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, జ్యోతి రమణ, నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, విజయ్ కుమార్, గంధం పరంజ్యోతి ,కౌన్సిలర్లు మురళీ సాగర్, శ్రీకర్ గౌడ్, మదన్, మహేశ్వర్ రెడ్డి, వెంకట్ సాగర్, మంద రాము, హర్షద్, మహేష్ ఉన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత యాదవ్

మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నారాయణపేట, మార్చి 7 ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేత యాదవ్ అన్నారు. స్థానిక చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డా.మెర్సి వసంత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల హక్కులను గుర్తించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. లింగ సమానత్వం, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పోరాటం, సమాన హక్కుల సాధన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించుకోవడం అవసరమని తెలిపారు. తల్లిగా, సోదరిగా, భార్యగా, కుమార్తెగా మహిళల పాత్ర మన జీవితాల్లో ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి. రంగారెడ్డి, ఈ.నారాయణ గౌడ్, బి. కృష్ణారెడ్డి, ఏ. భాస్కర్ రెడ్డి, డా. సి.హెచ్. శంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జి. శ్రీనివాస్, నిర్మల, సునీత, వసంత, సంగీత పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారం కోసం సర్పంచ్‌కు సిపిఎం వినతి



దామరగిద్ద, మార్చి 7 ప్రభాతవార్త : గ్రామంలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం నాయకులు దామరగిద్ద గ్రామ సర్పంచ్ అద్దన్‌కనికిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సందర్భంగా సిపిఎం నాయకుడు జోషి మాట్లాడుతూ గ్రామంలోనిపలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆవేదన వ్యక్త చేశారు. డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోతోందని, దీనివల్ల గ్రామంలో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమలవ్యాప్తి కారణంగా టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంటూ వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ఫాగింగ్ నిర్వహించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్ల పనులు, డ్రైనేజీ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా చూడాలని, అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అండగా నిలవాలని కోరారు. గ్రామ అభివృద్ధి విషయంలో పాలకవర్గం నిరక్ష్యం వీడి ప్రజల సమస్యలపై వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కనకప్ప, మహేష్, అంజి తదితరులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాటిపర్తి అంగన్వాడీ కేంద్రానికి టీవీ వితరణ

భూత్పూర్, మార్చి 7, ప్రభాతవార్త : భూత్పూర్ మండలం తాటిపర్తిలో ఉన్న అంగన్వాడీ కేంద్రానికి గ్రామ ఉపసర్పంచి మద్ద రాఘవేందర్ గ్రామ యువకుడు వంగరి రాఘవేందర్‌లు కలిసి చిన్నారుల వినోదం కోసం టీవీని బహుకరించారు. అంగన్వాడీ కేంద్రానికి టీవీని బహుకరించిన వీరిరువురిని గ్రామ సర్పంచి హబీబాఫసియోద్దిన్, వార్డు సభ్యుడు నరేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులుతో పాటు గ్రామ యువకులుమద్ద నర్సింహులు, వంగూరు శివ, వంగూరు వెంకటేష్, వంగూరు పవన్, వంగూరు నాని తదితరులు కలిసి పిల్లలకు అందిస్తున్న వంటకాలను ఆస్వాదించారు.

విద్యతోనే మహిళాభ్యున్నతి సాధ్యం

- అదనపు కలెక్టర్ ఫణిందర్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి

నారాయణపేట, మార్చి7 ప్రభాతవార్త: విద్యతోనే మహిళాభ్యున్నతి, మహిళా సాధికారిత సాధ్యమని నారాయణపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణిందర్ రెడ్డి అన్నారు. మహిళలు అవకాశాలను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణించాలని ఆయన సూచించారు. సరైన అవకాశాలు కల్పిస్తే మహిళలు సమర్ధవంతంగా అనుకున్నది సాధించగలరని తెలిపారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. గార్డెన్స్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలకు పురుషులతో పాటు సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల భద్రత, ఉపాధి అవకాశాల కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు. ప్రతి కుటుంబంలో మగ పిల్లలు, ఆడపిల్లలు అనే భేద భావం లేకుండా సమాన దృష్టితో చూడాలని సూచించారు మహిళలు తమ హక్కులు, ప్రభుత్వం కల్పిస్తున్నఅవకాశాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే గొప్ప వరం చదువేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో పురుషులతో సమానంగా రాణించాలని అన్నారు. మక్తల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ వాకిటి మానస మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీఅని పేర్కొన్నారు. కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేసిన ఐసిడిఎస్ సిబ్బంది, పోలీసులను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు. అలాగే నారాయణపేట, మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్‌చైర్‌పర్సన్లు, వార్డు కౌన్సిలర్లను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ అశోక్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల, మహిళా కౌన్సిలర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, సెర్ప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వట్టెం వెంకన్న బ్రహ్మోత్సవాలు

చక్రతీర్థ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, మార్చి7 ప్రభాతవార్త: వట్టెం శ్రీవెంకటేశ్వర స్వామి 40వ బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. దేవస్థానం యజ్ఞా చార్యులు శ్రీ సముద్రాల శ్రీమన్నారాయణ చార్యులు, దేవస్థాన ప్రధాన అర్చకులు శ్రీ ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో అర్చక బృందం వారం రోజులపాటు శాస్త్రవేత్తంగాబ్రహ్మోత్సవ కార్యక్రమా లను నిర్వహించారు. శనివారం చివరి రోజు స్వామివారి అభిషేక కార్యక్రమం అనంతరం చక్రతీర్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకుపవిత్ర పుష్కరనీలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న టు వంటి ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన భక్తాదులు పుష్కర స్నానము ఆచరించారు. అనంతరం ఉత్సవ పరిసమాప్తి కార్యక్రమంలో ముక్కోటి దేవతలకు శాస్త్రోక్తంగా వీడ్కోలు పలి కారు. ఈ సందర్భంగా దేవస్థాన వ్యవస్థాపక ట్రస్టీ శ్రీ సందడి ప్రతా పరెడ్డి అరుణ దంపతులు, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీఅనంత నరసింహారెడ్డి సుకన్య దంపతులు సందడి రంగారెడ్డి సోదరులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దేవస్థాన యాజమాన్యం అనంతనరసింహ్ రెడ్డిలుబ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించిన అర్చక బృందాన్ని, సిబ్బంది నీ అభినందిస్తూ సన్మానించారు.

శరవేగంగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనులు

భూత్పూర్ చౌరస్తాలో ప్రజాపాలన ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఇతర అధికారులు

భూత్పూర్, మార్చి 7, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టాక ప్రజా ప్రభుత్వం-ప్రజాపాలన రెండు మార్లు ప్రజాపాలన నిర్వహించింది. 2023 డిసెంబర్ 28నుంచి జనవరి 6వరకు పది రోజుల పాటు నిర్వహించింది. తొలివిడతలో గ్రామ, పట్టణ వార్డుల్లో సభలు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యల్ని పరిష్కరించే దిశగా అడుగేసింది. రెండో విడత ప్రజాపాలనను 2025 జనవరి గణతంత్రదినోత్సవం నుంచి 27వరకు మూడ్రోజుల పాటు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు చిన్నవైతే అక్కడికక్కడే పరిష్కరించే చర్యలు చేపట్టింది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్జీదారులతో ప్రత్యక్షంగా చర్చించి పరిష్కరించారు. రెండు విడతల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీల ఆధారంగానే పలు సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం మార్గం సుగమం చేసుకుంది. ప్రజాపాలనలో స్వీకరించిన అర్జీల ఆధారంగానే వాటికనుగుణంగా రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, రు.500వంట గ్యాస్ సిలెండర్, గృహజ్యోతి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇందిరమ్మ ఇండ్లు, కొత్తరేషన్‌కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ, సన్నాలకు రు.500ల బోనస్ వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. 2026 మార్చి 6నుంచి జూన్ 12వరకు 99రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. మూడో విడతగా మార్చి 6నుంచి 15 వరకు పది రోజుల పాటు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనులు శరవేగంగా నిర్వహిస్తోంది. 99రోజుల్లో మరో రెండు విడతలు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనులు నిర్వహించనుంది. ఇందులో భాగంగానే భూత్పూర్ మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు గడిచిన రెండ్రోజులుగా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక పనులు నిర్వహిస్తున్నారు. తొలిరోజు 6వ తేది శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, తహసిల్దార్ కిషన్‌నాయక్, కమిషనర్ చంద్రశేఖర్‌రావు వార్డు కౌన్సిలర్లు కెంద్యాల పద్మ, నిమ్మల అన్నపూర్ణ, చంద్రకళ, లత, మాధురి, లాల్యా, గద్దం ప్రేమ్, లిక్కి సూర్యకళ, కెంద్యాల శ్రీనివాసులుతో పాటు మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంధి పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మురుగు కాలువల పూడిక తీసివేత

మక్తల్ టౌన్, మార్చి7 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళిక ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మక్తల్ పురపాలక సంఘ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. అందులో భాగంగా శనివారం మక్తల్ పట్టణంలోని 16వ వార్డు అల్కురి పావని ఆధ్వర్యంలో లాల్ బహుదూర్ కాలనీలోప్రత్యేక శుభ్రత కార్యక్రమం మరియు ప్రజా భాగస్వామ్య కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు, మున్సిపల్ ఏఈ ఈ నాగశివ, మున్సిపల్ మేనేజర్ మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పిలు, ప్రజాప్రతినిధులు హాజరవ్వడం జరిగినది.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

మక్తల్ టౌన్, మార్చి7 ప్రభాతవార్త: స్వపరిపాలన దినోత్సవం సాధారణంగా పాఠశాలల్లో నిర్వహించే ఒక ప్రత్యేక కార్యక్రమం. ఇందులో విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రధానో పాధ్యాయులుగా, మండల, జిల్లా విద్యాధికారులుగా, జిల్లా కలెక్టర్ గా ఇతర సిబ్బందిగా బాధ్యతలు స్వీకరించి, ఒక రోజు పాఠశాల పరిపాలనను స్వయంగా నిర్వహించారు. ఇది విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, బాధ్యత మరియు క్రమశిక్షణను పెంపొందించడము తో పాటు ఉపాధ్యాయుల గొప్పతనాన్ని తెలుసుకున్నారని ప్రధానోపాధ్యాయులు అన్నారు. ఇది విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్నిపెంచి, వారి భవిష్యత్తు నాయకత్వ నైపుణ్యాలకు పునాది వేస్తుందనీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒక రోజు కలెక్టర్‌గా అక్షయ, జిల్లా, మండల విద్యాధికారులుగా ప్రవలిక, జి.శివ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పల్లవి బాధ్యతలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు చదువుతో పాటు, పరిపాలన సామాజిక బాధ్యతలను కూడా అర్థం చేసుకునే అవకాశం కలుగుతుంది అని తెలిపారుపై కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేష్, లక్ష్మీకాంత్, అశోక్, నరేందర్, మహిళా ఉపాధ్యాయులు శ్రీమతి శిరీష, మీరా కుల్కర్ణి, రూప, తిరుమల, కృష్ణవేణి, అలాగే ప్రియాంక, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నాసాగర్‌లో మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం

భూత్పూర్, మార్చి 7, ప్రభాతవార్త: భూత్పూర్ మండలం అన్నాసాగర్ జెడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయుల్ని ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు మహిళా ఉపాధ్యాయురాళ్లు జ్యోతి, శారద, విజయలక్ష్మి, రజిత (వాలంటీర్)లనుపాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, తెలుగు పండిట్ గుముడాల చక్రవర్తిగౌడ్‌లు శాలువలు, పూలమాలలతో ఘనంగా సత్కరించిముందస్తుగామహిళాదినోత్సవశుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

అంగన్‌వాడీ, పాఠశాలల వద్ద చెత్తను తొలగిస్తున్న దృశ్యం

మద్దూరు, మార్చి 7 ప్రభాతవార్త: గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మద్దూరు ఎంపీడీవో రామన్న సూచించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం దోరేపల్లి గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాల వద్ద చెత్తను తొలగించి శుభ్రపరిచారు. చిన్నారుల ఆరోగ్యానికి పరిశుభ్రత ఎంతో ముఖ్యమని సర్పంచ్ కె.నవిత అశోక్ గౌడ్ తెలిపారు. గ్రామ ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి గ్రామాన్ని స్వచ్ఛంగాఉంచేందుకు సహకరించాలనికోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆంజనేయులు, ఉప సర్పంచ్ నరేష్ గౌడ్, వార్డ్ సభ్యులు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు అనిల్, హనుమంతు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసిసి విద్యార్థులు కళాశాల అధ్యాపక బృందంతో మారేపల్లి సురేందర్ రెడ్డి

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

- కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఆదర్శంగా నిలవాలి
- డిప్యూటీ మేయర్ ఎం. సురేందర్ రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థి ఉన్నతంగా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, లక్ష్య సాధనకు నిత్యం కృషిచేస్తూ ముందుకు సాగాలని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్ లోని ఎన్టీఆర్ డిగ్రీ కాలేజ్ లో నిర్వహించిన ప్రజ పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణ కార్యక్రమంలో మహబూబ్ నగర్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజ్ ప్రాంగణం పరిసర ప్రాంతాలు శ్రమదానం చేసి పరిశుభ్రంగా ఉంచుకొని ఎన్టీఆర్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు అందరూ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం డిగ్రీ పట్టా మన జీవితానికి మైలురాయి లాంటిది మన లక్ష్యం ఎప్పుడు ఉన్నత స్థాయికి ఎదిగేలా ఎంచుకోవాలి సందేశము ఇచ్చారు.అనంతరం కాలేజ్ బృందం సురేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రమేష్ , కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్ నూతన తహసీల్దారుగా వరలక్ష్మి

శ్రీరంగాపూర్, మార్చి7 ప్రభాతవార్త: వనపర్తి జిల్లా ఆదర్శ సురభి ఆదేశాల మేరకు జిల్లాలో మొత్తం పదిమంది తహసిల్దారులు బదిలీ అయ్యారు. ఈ బదిలీలో భాగంగా శ్రీరంగాపూర్ మండల నూతన తహసిల్దార్‌గా వరలక్ష్మి శనివారం బాధ్యతలను చేపట్టారు. నూతన తహసిల్దార్ వరలక్ష్మీ మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తూ, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. ఇక్కడ పనిచేసిన తహసిల్దార్ రాజు మదనాపూంకు బదిలీ అయ్యారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఒకరిపై కేసు నమోదు

రేషన్‌బియ్యం పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

నర్వ,మార్చి 7 ప్రభాతవార్త: నర్వ మండల పరిధిలోని యాంకీ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రేషన్ బియ్యాన్ని శనివారం నర్వ పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఎస్సై పబ్బతి రమేష్ తెలిపిన ప్రకారం నర్వ పోలీసులు యాంకీ గ్రామంలో తనిఖీ చేపట్టగా అదే గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనివాసులు నివాసంలో నిల్వ ఉంచిన 19 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకోవడం జరిగిందన్నారు.5.80 క్వింటాళ్ల రేషన్ బియ్యం విలువ సుమారుగా 14,500 ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడు శ్రీనివాసులు చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరించి తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసినట్లు విచారణలో తేలింది.గ్రామంలో పంచనామ నిర్వహించి బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ డిటి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడుపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినా,కొనుగోలు చేసిన,విక్రయించిన శాఖపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

రాజకీయ ఆర్థిక సమానత్వం కోసం ఉద్యమించాలి

కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న ప్రసాద్

ఆత్మకూర్ మార్చి 7, ప్రభాతవార్త: ప్రస్తుత సమాజంలో మహిళలు కేవలం తమ హక్కుల కోసమే కాకుండా రాజకీయ మరియు ఆర్థిక సమానత్వం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పియుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ ఆత్మకూరు మండలంలోని బాలకృష్ణపూర్ గ్రామంలో గల కేజీబీవీ ప్రత్యేక అధికారి స్వప్న తదితరులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేవలంసభలకు సమావేశాలకు పరిమితం కాకుండా మహిళలు ప్రస్తుత సమాజంలో పురుషులకు దీటుగా రాజకీయ మరియు ఆర్థిక సమానత్వం కోసంఉద్యమించడమే కాకుండా భవిష్యత్ తరాలకు స్వేచ్ఛ సమానత్వాలు అందించేందుకు తమ వంతు కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు కేవలం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకోవడమే కాదని మహిళలు తాము పడుతున్న శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. శనివారం రోజు ఆత్మకూరుమండలంలోని బాలా కిస్టాపూర్ గ్రామ సమీపంలో గల కేజీబీవీ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి పలువురు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు చిన్నారిబాలబాలికలకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను నిర్వహించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాబోయే తరాలకు మహిళ పట్ల గౌరవం పెంచే విధంగా ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో పాటుగా పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

కోయిలకొండ మార్చి7, ప్రభాతవార్త: మండల కేంద్రమైన కోయిలకొండ మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను మహబూబ్ నగర్ గర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరసింహారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలోనే కళ్యాణ లక్ష్మీ చెక్కులను, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జిరవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై విద్యాసాగర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకుడు పెరికివీడు సత్యపాల్ రెడ్డి, తహసిల్దార్ రాజా గణేష్, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, పేట నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్, వార్డు సభ్యుడు ఎం రామస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ హనీమీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభంగ పట్టణం గ్రామంలో గ్రంథాలయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

గ్రంథాలయ చైర్మన్‌కు వినతి పత్రం అందజేసిన సర్పంచ్ సిర్ర వంశీ

కోయిలకొండ మార్చి 7, ప్రభాతవార్త: కోయిలకొండ మండలం అభంగపట్నం గ్రామంలో గ్రంథాలయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి కి గ్రామ సర్పంచ్ సిర్ర వంశి గ్రామస్తులతో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ జనాభాకు అనుగుణంగా గ్రామంలో గ్రంథాలయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజా అవసరాలను తీర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. గ్రామంలో చాలా కాలంగా గ్రంథాలయ కేంద్రం లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాజమణి చంద్రయ్య, రాజు, మేకల రఘు, శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

మహిళ లేనిదే మనుగడ లేదు

- మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో ఎమ్మెల్యే

వనపర్తి ప్రతినిధి, మార్చి7 ప్రభాతవార్త: మహిళ లేనిదే మనుగడ లేదని,మహిళా సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి సంతకం రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణంచేసేందుకు సంబంధించిన దస్త్రంపై చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి ఆ కమిటీలకు మహిళలనే చైర్ పర్సన్ గా ఉండేలా చేశారని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులకు ఏక రూప దుస్తులు కుట్టేందుకు మహిళా సంఘాలకు అప్పగించారని నేడు విద్యార్థులకు దుస్తులు తయారీలో మహిళలు ఎంతో ఆర్థిక స్వావలంబన పొందుతున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం సైతం మహిళలు ఏర్పాటు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు.అన్నింటికీ మించి ఆర్టీసీ బస్సులో కొనుగోలులో మహిళలను భాగస్వామ్యంలో బస్సులను కొనుగోలు చేసి నెలకు రూ.7వేల ఆదాయం వచ్చేలా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.ఎలాంటి తనకా లేకుండా ఒక్కో మహిళకు రూ. 20లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అని చెప్పారు.హైదరాబాదులోని శిల్పారామం వద్ద వేల కోట్ల విలువగల రెండు ఎకరాల స్థలంలో మహిళల ఉత్పత్తులను ఏర్పాటు చేశారనిదాంతో స్వయం ఉపాధి ఎంచుకున్న మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు.గ్రామ గ్రామాన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళా సమైక్యల ద్వారా ఏర్పాటు చేయించి తద్వారా వచ్చే కమిషన్లతో మహిళల ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.మహిళల పేరునే ఇందిరమ్మ ఇండ్లు,మహిళల పేరుని రేషన్ కార్డులు జారీ చేస్తుందని ఆయన తెలిపారు.దాంతోపాటు మహిళలకు 10 లక్షల బీమా సౌకర్యం సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని ఇట్టి సౌకర్యాన్ని ప్రతి ఒక్క మహిళా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.గతంలో ఉన్న కొందరు వనపర్తిని పూర్తిగా తామే అభివృద్ధి చేశారని చెప్పడం హాస్యాస్పదమని ఆయన విమర్శించారు.ఈ సందర్భంగా వనపర్తి మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికైన మహిళా కౌన్సిలర్ల అందర్నీ ఆయన శాలువాలతో సత్కరించి గౌరవించారు.అనంతరం మున్సిపాలిటీ వర్కర్ల పని చేసే మహిళలను శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మిడిదొడ్డి మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది మహిళ ఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మహిళలకు ఒకవరం

మహిళా శక్తి క్యాంటీన్

మక్తల్ టౌన్, మార్చి7 ప్రభాతవార్త : ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, మహిళల ఆత్మవిశ్వాసానికి, సాధికారతకు ప్రతీక. ఇందిరా క్యాంటీన్లు క్యాంటీన్లు మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించడమే కాకుండా, మాలో ఉన్న నైపుణ్యాలను వికసింపజేస్తున్నాయి. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లో మహిళాసంఘాల ద్వారా గత సంవత్సరం మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. తద్వారా మాకు జీవన ఉపాధి మా నైపుణ్యాలను వెలికి తీసే విధంగా, మా జీవితాల్లో వెలుగులా,ఒక వరంగా భావిస్తున్నామని మహిళా సభ్యురాలు తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం ఎక్కువగా జొన్న రొట్టెలు ఎక్కువగా ఉద్యోగరిత్యా వెళ్లేవారు ఉదయాన్నే వచ్చి మా దగ్గర రొట్టెలు ఎక్కువగా అల్పాహారం తీసుకొనడం జరుగుతుంది. తదనంతరం మధ్యాహ్నం భోజనం అందరూ ఇష్టపడి తీసుకోవడం జరుగుతుంది. ప్రతి సోమవారం భక్ష్యాలు చేయడం మా ప్రత్యేకత అని ఇందిరా క్యాంటీన్ నిర్వహకురాలు మహిళా సంఘం అధ్యక్షురాలు మహాదేవమ్మ, కోశాధికారి రాజేశ్వరి తెలియజేశారు.మహిళల చైతన్యం నైపుణ్యాల అభివృద్ధి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ మహిళలకు ఒక వరం లాంటిదని అన్నారు. మా జీవితాల్లో సానుకూల మార్పులను తీసుకువస్తోందని భావిస్తున్నామన్నారు.

ఆత్మకూర్ అభివృద్ధికి సహకరించండి

ఆత్మకూర్ సమస్యలపై ఎంపీ డీకే అరుణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి కౌన్సిలర్లు

ఆత్మకూర్ మార్చి7, ప్రభాతవార్త: మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మను ఆత్మకూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో కలిసివిజ్ఞప్తి చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్ గా విజయం సాధించిన జిందే జ్యోతి పుల్లరి భరత్ చెట్ల లలిత తదితరులు శనివారం రోజు ఎంపీ డీకే అరుణమ్మను కలిసి ఆత్మకూరు అభివృద్ధికి ప్రత్యేక నిధులకు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లుగా ప్రభాత వార్తకు తెలిపారు. ఇప్పటికే పట్టణంలో అమృత్ రెండు పథకం ద్వారా మంచినీటి సౌకర్యానికి కోట్లాదినిధులు వెచ్చించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించి ఆత్మకూరు అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించాలని విజ్ఞప్తి చేయడంతో డీకే అరుణమ్మ సానుకూలంగా స్పందిస్తూనియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మూడు ముక్కలుగా ఏర్పాటైన ఆత్మకూరు పట్టణానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తమ వంతు శక్తివంతం లేకుండా కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చినట్లుగా బిజెపి కౌన్సిలర్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో ఆత్మకూరును అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం వీఫలమవుతున్న విషయాన్ని పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలకు ఆత్మకూరులోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట వెడల్పుకు, ఎంపీ డీకే అరుణమ్మను కలిసిన వారిలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి, ఆత్మకూర్ బిజెపి మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్, బిజెపి జిల్లా నాయకులు జిందె శ్రీనివాసులు, ఆంజనేయులు ముదిరాజ్ ,ఆనంద్ ,లక్ష్మీకాంత్ తదితరులతో పాటుగా పలువురు పాల్గొన్నట్లుగా వారు తెలిపారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలి

టిపిసిసి ఉపాధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పై ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే

ఉప్పునుంతల, మార్చి 7 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం ప్రజలలోకి వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చేయాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అపరిశుభ్రత లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని, సమస్యలుంటే సత్వరమే పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు నాగర్ కర్నూల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంగాపురం రాజేందర్, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అడపాల గోపాల్ రెడ్డి, మాజీ ఎంపిపి రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు శారదమ్మ, మున్సిపల్ కౌన్సిలర్ గౌరీ శంకర్, తగరం శ్రీనివాసులు, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు లేని భారత దేశంగా మారాలి: ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

గోడ పత్రిక విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

ఉప్పునుంతల, మార్చి 7 ప్రభాతవార్త : బాల్య వివాహాలు లేని భారత దేశంగా మారాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు,నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు లేని భారతదేశం అనే అంశంపై మండలంలోని నడింపల్లి గ్రామం లో సంతకాల సేకరణ, బాల్య వివాహాల పై దుష్ప్రచారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువత, మహిళలు, ప్రజలు,పెద్ద ఎత్తున పాల్గొని బాల్య వివాహాలు పూర్తి నిర్మూలించాలనే సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగించాలనిఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటిరజితమల్లేష్, అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు శారదమ్మ,పాఠశాల ఉపాధ్యాయులు కోనేరు సంస్థ ప్రతినిధులు, నిర్వాహకులు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాల్ దీన్నేలో సిసి రోడ్లు నిర్మాణానికి భూమి పూజ

వీపనగండ్ల మార్చి 7, ప్రభాతవార్త: గోపాల్ దీన్నే గ్రామపంచాయతీ ఎస్ సి సబ్ ప్లాన్ నిధుల ద్వారా 20 లక్షల రూపాయల సిసి రోడ్లు మంజూరు కావడం జరిగింది. ఆ గ్రామ సర్పంచ్ దొడ్ల కవిత తెలిపారు. శనివారం నాడు ఆ పనులకు భూమి పూజ చేసే ప్రారంభించడం జరిగింది. అని ఆమె తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయడం జరుగుతుందని గ్రామపంచాయతీ నిధులు గాని ప్రభుత్వం నుండి వచ్చే మంత్రి ద్వారా నిధులు కానీ గ్రామానికి వెచ్చించి గ్రామ అభివృద్ధిలో ముందుకు వెళ్లే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వెంకటస్వామి, కార్యదర్శి కరుణాకర్, వార్డు మెంబర్స్ కురుమయ్య, చంద్రయ్య, లలితమ్మ,భాగ్యమ్మ, పద్మమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ విజయ్ కుమార్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఎల్ల స్వామి, ఎం నారాయణ గ్రామ రైతులు రాజ వర్ధన్ రెడ్డి, బాల్ సామ్ రెడ్డి, భాస్కర్, పరమేష్, మోహన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం

నారాయణపేట, మార్చి7 ప్రభాతవార్త : నారాయణపేట మండలం అప్పిరెడ్డిపల్లి గ్రామంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు రంగా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూసారాన్ని పెంచే విధంగా సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ పద్ధతులతో వ్యవసాయం చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. దేశీయ నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేసి ఇతర రైతులకు అందించాలని తెలిపారు.గ్రామంలో సేంద్రియ పద్ధతులతో కూరగాయలు పండించి అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించారు. రైతులు సంఘటితంగా ఉంటేనే వ్యవసాయ సమస్యలను సమర్థంగా పరిష్కరించుకోవచ్చని అన్నారు. ప్రతి నెల రైతులతో సమావేశాలు నిర్వహించి వ్యవసాయ సమస్యలపై చర్చించి పరిష్కారం కనుగొనాలని సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కోసిగి హనుమంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పోలీస్ వెంకటరెడ్డి, గ్రామ కార్యదర్శి పటేల్ బసిరెడ్డి,గవినోళ్ల నవత్‌రెడ్డి,బంకుల్ శంకర్‌రెడ్డి, కొండగారి రాము, గుడిసె నరసింహ, జుట్టురాములు,కావలి సుదర్శన్, బలిజ మణికంఠ, బొక్కగజలప్ప, బొక్క వెంకటప్ప, బసలమ్మని భీమప్పతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలి : ఎస్సై రాజు

దామరగిద్ద, మార్చి7 ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ డా. వినీత్ ఆదేశాల మేరకు దామరగిద్ద పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, దేవాలయ పూజారులతో ప్రత్యేక సమావేశాన్ని ఎస్సై రాజు నిర్వహించారు. గ్రామాల్లో శాంతి భద్రతలను బలోపేతం చేయడం, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూగ్రామాల్లోని దేవాలయాల్లో ఉన్న విలువైన ఆభరణాలు, ఇతర వస్తువులను భద్రత దృష్ట్యా బ్యాంకుల లాకర్లలో భద్రపరచుకోవాలనిసూచించారు.అలాగే దేవాలయాలకు పటిష్టమైన లాకింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా కొత్తగా వచ్చిన వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు.గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో సర్పంచులు,గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరిస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చనిఎస్సై రాజుతెలిపారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది, మండల పరిధిలోని సర్పంచులు, ఉప సర్పంచులు, దేవాలయ పూజారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మక్తల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ వాకిటి మానస

మక్తల్ టౌన్, మార్చి7 ప్రభాతవార్త : మక్తల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా ఎన్నిక కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మక్తల్ మున్సిపాలిటీ అభివృద్ధిలోమంత్రి వాకిటి శ్రీహరి పశుసంవర్ధక క్రీడాశాఖ మంత్రి సమక్షంలో ముందడుగు వేసి మక్తల్ అభివృద్ధికి తోడ్పడతాననిమహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో క్లీన్ అండ్ గ్రీన్

ఉప్పునుంతల, మార్చి7 ప్రభాతవార్త: ప్రజా పాలన ప్రగతిలో భాగంగా శనివారం మండలంలో వివిధ గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచులు మాట్లాడుతూ మన గ్రామం బాగుంటేనే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని,అలాగే గ్రామంలో ఉన్న పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు చింత గాళ్ళ శ్రీనివాసులు, బలిగెర శ్రీకాంత్, చింతోజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉప్పునుంతల ఆసుపత్రిలో హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమం

ఉప్పునుంతల, మార్చి 7 ప్రభాతవార్త: మండల కేంద్రమైన ఉప్పునుంతల సామాజిక కేంద్రం (సిహెచ్‌సి) హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ప్రాథమిక వైద్య అధికారిణి డా. స్వప్న తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌పివి వ్యాక్సిన్ ను 14 సంవత్సరాల లోపు గల బాలికలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా ఇచ్చే వ్యాక్సిన్ అనిఆమె తెలిపారు. టీకాలు ఇచ్చే విధానం పై సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది అని పేర్కొన్నారు. అందుకని ఉప్పునుంతల మండల ప్రజలు 14 సంవత్సరాల బాలికలకు వ్యాక్సిన్ ఇప్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

నక్ష బాట ఆక్రమించారంటూ గ్రామస్తుల ఫిర్యాదు

బాలానగర్ మార్చి7 ప్రభాతవార్త : బాలానగర్ మండల పరిధిలోని మోతీ ఘనపూర్ నుండి పలుగుగుట్టకు వెళ్లే నక్ష బాటను సీఎస్కే వెంచర్ యాజమాన్యం ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించిందని గ్రామస్తులు శనివారం అదనపు కలెక్టర్ హరిప్రియకు ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో ఉన్న నక్ష బాటకు బదులుగా మరో రోడ్డును నిర్మిస్తామని సీఎస్కే వెంచర్ యాజమాన్యం చెప్పినప్పటికీ, ఇప్పటివరకు నిర్మించలేదని గ్రామస్తులు తెలిపారు. అలాగే ఆ రోడ్డును ఇప్పటివరకు గ్రామపంచాయతీ పేరిట తిరిగి రిజిస్ట్రేషన్ కూడా చేయలేదనిఆవేదన వ్యక్తం చేశారు.భవిష్యత్తులో తమ పరిధిలో ఉన్న బాటను కూడా ప్లాట్లుగా మార్చి అమ్ముకునే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల మోతీ ఘనపూర్ గ్రామ నక్ష బాటను ఆక్రమించి ప్లాట్లు చేసిన నేపథ్యంలో ప్రస్తుతం బాటగావదిలిన రోడ్డును నక్ష బాట స్థానంలో గ్రామపంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ఫిర్యాదులు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ రాజు,ఉప సర్పంచ్ ప్రవీణ్ యాదవ్, పురుషోత్తంరెడ్డి, గ్రామవార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుండెడ్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

బాలానగర్, మార్చి 7 ప్రభాతవార్త: బాలానగర్ మండలంలోని గుండేడ్ గ్రామంలో శనివారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ శశివర్ణ పవన్ కుమార్ సూచన మేరకు, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, సేవామొబైల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆరోగ్య శిబిరంలో గ్రామానికి చెందిన వందలాది మంది ప్రజలు పాల్గొని, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో రక్తపోటు, మధుమేహం, రక్తహీనత వంటి పరీక్షలను నిర్వహించారు.అలాగే అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత విభాగం మేనేజర్ పరమేష్, డివిజన్ మేనేజర్ కృష్ణ,రీజనల్ మేనేజర్ రాజు,బ్రాంచ్ మేనేజర్ శ్రీశైలం, ప్రదీప్, మహేందర్ తదితర బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

యంనోనిపల్లిలో ప్రజాపాలన ప్రగతి పరిశీలన

ధన్వాడ, మార్చి 7 ప్రభాతవార్త: ధన్వాడ మండలంలోని యంనోని పల్లి గ్రామంలో ఈరోజు అంగన్‌వాడి కేంద్రం, పాఠశాల వద్ద ప్రజాపాలన ప్రగతి పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు, అంగన్‌వాడి సేవలు, పాఠశాల కార్యకలాపాలపై అధికారులు సమీక్షనిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు,ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకొని అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌బోయే నాగేశ్వర్ ఉపసర్పంచ్ సిద్ధప్ప పంచాయతీ సెక్రెటరీ పాఠశాల ఉపాధ్యాయురాలు అంగన్‌వాడి టీచర్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత హెచ్‌పివి టీకాను తీసుకొని గర్భాశయ క్యాన్సర్‌ను నివారించుకోవాలని సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు సృష్టికిమూలమని, మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని అన్నారు. ఈ సందర్భంగా కళాజాత బృందం పాటలు పాడారు, చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు చేశారు, మహిళలు క్యాట్‌వాక్, క్విజ్ పోటీలు, బెలూన్ గేమ్స్ వంటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపి డికె అరుజిల్లా కలెక్టర్‌తో కలిసి హెచ్‌పివి టీకా కార్యక్రమానికి సంబంధించిన ఇంజెక్షన్‌ను ఆవిష్కరించడంతో పాటు అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ అధికారిణి జరీనా, డిఆర్‌డిఓ నర్సింహులు, డిఎంహెచ్‌ఓ డా. కె. కృష్ణ, డిఎస్‌ఓ గంపశ్రీనివాస్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిని డి. సునీత, డిపిఆర్‌ఓ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారిని మంజుల, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు, మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నీతి అయోగ్ ప్రాంతీయ బెస్ట్ ప్రాక్టీసెస్ సెమినార్‌కు గట్టు బ్లాక్ ఎంపిక

(మొదటి పేజీ తరువాయి)

సేవ సంస్థల సహకారంతో ఉదయం పోషకాహార కార్యక్రమాలు అమలు చేయడం వలన విద్యార్థుల హాజరు శాతం పెరిగింది అన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడమే కాక క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో వారిని పాలుపంచుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాంతో పదవ తరగతి ఫలితాలుగణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. ఈ విజయానికి కారణం విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధుల సమిష్టి కృషి పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యారంగంలో, నిర్దేశిత ఇతర అంశాల్లోనూ మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టి జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సేవా సంస్థలు కలిసికట్టుగా పనిచేస్తాయని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

వనపర్తి విద్యా రంగానికి రాష్ట్రంలో గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

ఆదర్శ్ సురభి మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, పథకాల సమర్థ అమలు, విద్యార్థుల హాజరు పెంపు వంటి చర్యలతో వనపర్తి జిల్లా విద్యా రంగంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోంది.

60 రోజులకు మించి పెండింగ్ ఉండొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేసి అర్హులైన వారికి త్వరగా పెన్షన్లు మంజూరు చేయాలని కూడా సూచించారు. ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం కింద జరుగుతున్న ఎలక్టోరల్ మ్యాపింగ్, ప్రోజనీ మ్యాపింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్లకు ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం 80 శాతం లక్ష్యాన్ని సాధించాలని చెప్పారు. దీనికి సంబంధించి బీఎల్‌ఓసూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ ఆఫీసర్లతో తరచుగా సమావేశాలు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని తహసీల్దార్లు, ఇతర తహసీల్దార్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ జేవీ హరి ప్రియను సత్కరించి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూమహిళా దినోత్సవశుభాకాంక్షలు తెలియజేసి, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు పురుషుల సహకారం కూడా అవసరమని అన్నారు. మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పిస్తే వారు తమ తమ రంగాల్లో ఖచ్చితంగా రాణిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డీవోనవీన్, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడిఅశోక్, ఇతరఅధికారులు పాల్గొన్నారు.

హైవే పై అధికారులను కలిసిన ఎల్లేని

కొల్లాపూర్, మార్చి7 ప్రభాతవార్త: కొల్లాపూర్ మీదుగా జాతీయ రహదారి కోసం ఇచ్చిన మాట ప్రకారం అనునిత్యం హైవే అధికారులను కలుస్తూ.. పూర్తి నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న బిజెపి కొల్లాపూర్ ఇంఛార్జి ఎల్లేని సుధాకర్ రావు మూడు రోజుల క్రితం హైవే అధికారులను కలిశారు. నేషనల్ హైవే 167 రోడ్డు నిర్మాణం తో పాటు సోమశిల ఐకాన్ వంతెన పనులు ప్రారంభించాలని సూచించారు. అడవిశాఖ శుక్రవారం ఐకాన్‌బ్రిడ్జి నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జరిగింది. సోమశిల ఐకానిక్ వంతెన నిర్మాణానికి కీలక ముందడుగుకృష్ణా నదిపై సోమశిల వద్ద ప్రతిష్టాత్మక బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమం అయింది. వంతెన నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతులు మంజూరు24.66 హెక్టార్ల అటవీభూమి మళ్లింపుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్‌అటవీ అనుమతులురావడంతో పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉందని వంతెన నిర్మాణంతో నాగర్ కర్నూల్– కర్నూల్ జిల్లాల మధ్య రాకపోకలు సులభం ప్రాంతీయ అభివృద్ధికి సోమశిల బ్రిడ్జి కీలకంగా మారనుందనీ ఆయన అన్నారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

బిఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయా..?

మున్సిపల్ ఎన్నికల ప్రభావం ... నాయకుల మధ్య ఆరోపణలు ప్రత్యారోపణలు

మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

మద్దూరు, మార్చి 7 ప్రభాతవార్త: మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు బహిరంగంగా బయట పడుతున్నాయి. పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు ఘాటుగా ఆరోపణలు చేసుకుంటూ వేర్వేరు విలేకరుల సమావేశాలు నిర్వహించడం స్థానిక రాజకీయాల్లో కలకలం రేపుతోంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా పని చేశారనే ఆరోపణలతో కొంతమంది నాయకులను సస్పెండ్ చేయడం వివాదా నికి దారి తీసింది. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినందుకే సలీం, వీరారెడ్డిని పార్టీ ఉన్నత నాయకత్వం ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పార్టీ పదవులు అనుభవించిన నాయకులే ఎన్నికల సమయంలో పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరించడం బాధాకరమని ఆయన వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ నాయకుడు శివకుమార్ మాట్లాడుతూ కొంతమంది ప్రభావశీల నాయకులుపార్టీ అభ్యర్థులు ఓడిపోవా లని పన్నాగాలు పన్నారని ఆరోపించారు. పార్టీ అంతర్గత విషయాలను బయటకు తీసుకు వచ్చి ఆర్థిక అంశాలను ప్రస్తావిస్తూ పార్టీలో గందరగోళం సృష్టించే ప్రయత్నం జరుగుతోందని కౌన్సిలర్ నరసింహులు విమర్శించారు. పార్టీని బలహీన పరిచే చర్యలకు పాల్పడే వారికి కార్యకర్తలు సమాధానం చెబుతారని నాయకులు హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు మహేందర్ మాట్లా డుతూ మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ చైర్మన్ గెలుపును అడ్డుకునేం దుకు కొందరు నాయకులు మాట్లాడిన వాయిస్ రికార్డింగులు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. అవసరమైతే ఆ రికార్డులను బహిర్గతం చేయడానికి సిద్ధంగా ఉన్నామనిస్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ దినేష్, లింగ్యానాయక్, సీనియర్ నాయకులు నెల్లి రాములు, నరేష్‌యాదవ్, విఠల్, సాయిలు, ఖయ్యూం, బాలచంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోపణలను ఖండించిన సలీం – వీరారెడ్డి

ఇదిలా ఉండగా సలీం, వీరారెడ్డి వేరుగా విలేకరుల సమావేశం నిర్వహించి తమపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో తాము పార్టీకి వ్యతిరేకంగా పనిచేయలేదని స్పష్టం చేశారు. పార్టీ ఆదేశాల మేరకే మక్తల్ మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. తమకు ఎలాంటి వివరణ కోరకుండా సస్పెండ్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. రాబోయే ఎమ్మెల్యే ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి స్థానిక వ్యక్తికి అవకాశం ఇస్తే పార్టీ బలోపేతం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానికంగా బిఆర్ఎస్ నాయకుల మధ్య పెరుగుతున్న ఈ విభేదాలు భవిష్యత్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

ప్రగతి ప్రణాళిక ఒట్టి బోగస్..

- పనులు చేయడానికి కాంట్రాక్టర్లు భయపడుతున్నారు
- రాష్ట్ర ప్రభుత్వంలో బాత్రూంలు కట్టడానికి కూడా నిధులు లేవు
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, పబ్లిక్ స్కూళ్లు అంటూ మోసం
- ఉన్న స్కూళ్లను బాగు చేయొచ్చు కదా?
- టీచర్లు లేరు.. వసతులు లేవు
- కాంగ్రెస్ ది యాక్టింగ్ ప్లాన్.. యాక్షన్ ప్లాన్ కాదు
- మీడియా సమావేశంలో ఎంపీ డీకే అరుణ

మాట్లాడుతున్న ఎంపి డికె అరుణ

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 7 ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం “99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక“ ఒట్టి బోగస్ అని రాష్ట్ర ప్రభుత్వంలో బాత్రూంలో కట్టడానికే నిధులు లేవని, ఇక ప్రగతి ఎక్కడ ఉంది ఏం ప్రణాళిక చేస్తారని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికే అధికారంలోకి వచ్చి రెండున్నర ఏండ్లు కావస్తున్నదని మహిళలకు ఇస్తానన్న రూపాయలు 2500, డిగ్రీ విద్యార్థులకుస్కూటీలు, రైతులకు రైతు భరోసా లాంటి ఎన్నో పథకాలను అమలు చేయకుండా మళ్లీ కొత్తగా ప్రగతి ప్రణాళిక ఏంటో అర్థం కావడం లేదు అన్నారు. కాంగ్రెస్ ది యాక్టింగ్ ప్లాన్ తప్ప యాక్షన్ ప్లాన్ లేదన్నారు. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్లు మళ్లీ తాజాగా పబ్లిక్ స్కూళ్లు అంటూ ప్రజలను మోసం చేయడం తప్ప ఇంకోటి కాదన్నారు. ఉన్న స్కూళ్లను బాగుచేసి మౌలిక వసతులు కల్పించి టీచర్లను నియమించాలని సూచించారు.

ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరగలేని పరిస్థితి : రాష్ట్ర ప్రభుత్వంలో నిధులు లేక ఎమ్మెల్యేలు గ్రామాల్లో తిరుగలేని పరిస్థితి నెలకొందని ఎంపీ డీకే అరుణ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఎమ్మెల్యేల ముఖాలను గ్రామాల్లో చూపించాలని ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా ముందుకు తీసుకెళ్లలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, 60 నుంచి 40శాతం పద్ధతిలో పనులు చేయాల్సి ఉన్న కనీసం 40% నిధులను కూడా కేటాయించలేని పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో ఏ పనులు చేయాలన్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడానికి భయపడుతున్నారని, బిల్లును చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక సీనియర్ సిటిజన్స్ నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు పిఆర్సి, డిఏ ఇస్తామని చెప్పి నేటికీ దాని ఊసే లేదన్నారు. సమావేశంలో బిజెపిజాతీయ కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, కార్పొరేటర్లు పాండు రంగారెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, గూండా సంతోష్, నాయకులు అచ్చుగట్ల అంజయ్య, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, బంగ్లా రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

-మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, మార్చి 7 ప్రభాతవార్త: ప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కులమతాలకతీతంగా అందరికీ ప్రపంచ స్థాయి విద్యనుఅందించేందుకుప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తోందని, విద్యార్థులు సెల్‌ఫోన్ల వ్యామోహంలో పడకుండా భవిష్యత్తుపైదృష్టి సారించాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు బృంగి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సావిత్రి బాయి పూలే, ఫాతిమా షేక్ వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ మహమూద్, వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు మబ్బు రామరాజు, ఏజాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, సర్పంచ్‌లు రమేష్ నాయక్, రవిగౌడ్, కాంగ్రెస్ నాయకులు ఇంజమూరి కరణ్, బాల్ జంగయ్య, పడకంటి వెంకటేష్, దున్న సురేష్, శ్రీశైలం, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

మున్సిపల్ మహిళా కార్మికులను, సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

మక్తల్ టౌన్, మార్చి 7 ప్రభాతవార్త : మక్తల్ పురపాలక సంఘం చైర్మన్ వాకిటి మానస సమక్షంలో మహిళ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో చైర్మన్ ను కౌన్సిలర్లను, మహిళా కార్మికులను, మహిళా సిబ్బందిని సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కమీషనర్ శ్రీ రాములు మాట్లాడుతూ. మార్చి 8నప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇది కేవలం ఒక రోజు వేడుక మాత్రమే కాదు సమాజం కోసం మహిళలు చేస్తున్న కృషిని గుర్తించే రోజు, వారి హక్కుల కోసం పోరాడే స్ఫూర్తినిచ్చే రోజు. మహిళబహుముఖ ప్రజ్ఞాశాలి నేటిమహిళ కేవలం ఇంటికే పరిమితం కాకుండా, ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. అమ్మగా ప్రేమిస్తూనే, బాధ్యతగల ఉద్యోగిగా, సమర్థవంతమైన నాయకురాలిగా తనను తాను నిరూపించుకుంటోంది. గృహిణిగా కుటుంబానికి వెన్నెముకగా నిలుస్తూ భావి తరాలను తీర్చిదిద్దుతుంది. ఒక మహిళ వృత్తి, వ్యాపారం ఇలా అన్ని రంగాల్లోనూ తన ప్రత్యేక ముద్ర వేసుకుంది. ఒక మగవాడికి చదువు చెబితే ఆ వ్యక్తికి మాత్రమే జ్ఞానం లభిస్తుంది, కానీ ఒక మహిళకు చదువు చెబితే ఆ కుటుంబం మొత్తానికి వెలుగు లభిస్తుంది. మహిళా సాధికారత అనేది ఆర్థికంగా ఎదగడమే కాదు, సొంతంగా నిర్ణయాలు తీసుకోగల శక్తిని కలిగి ఉండటం. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం మనందరి బాధ్యత గా భావించాలి. మహిళ లేనిదే జననం లేదు, మహిళ లేనిదే గమనం లేదు. స్త్రీ గౌరవించబడే చోట దేవతలు కొలువై ఉంటారని మన సంస్కృతి చెబుతోంది. మహిళా దినోత్సవం అంటే కేవలం శుభాకాంక్షలు చెప్పడం మాత్రమే కాదు, వారి పట్ల గౌరవాన్ని ప్రదర్శించడం వారికి అండగా నిలబడటం ఒక గౌరవమని కొనియాడారు. మున్సిపల్ కార్యాలయం నందు రికార్డు గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనం , చైర్మన్, మేనేజర్ మున్సిపల్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు అందరూ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 11న కల్వకుర్తిలో జిల్లా స్థాయిలో క్రీడా ఎంపికలు
- జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి

కల్వకుర్తి, మార్చి 7 ప్రభాతవార్త: కల్వకుర్తి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వాటర్ స్పోర్ట్స్ గిరిజన క్రీడా పాఠశాలలో 2026–27 విద్యా సంవత్సరంలోప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ఫిరంగి ఒక ప్రకటనలో తెలిపారు. 4 తరగతి పూర్తిచేసిన వారు అర్హులని ఆయన అన్నారు. క్రీడా పాఠశాలలో ఐదవ తరగతిలో చేరేందుకు అర్హత పరీక్ష తోపాటు, శారీరక సామర్థ్య పరీక్షల నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈనెల 9 వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 2026ఆగస్టు నాటికి 9నుండి 11 సంవత్సరాల లోపు ఉన్న గిరిజన విద్యార్థిని విద్యార్థులు అర్హులన్నారు. శారీరక సామర్థ్య పరీక్షలో భాగంగా ఎత్తు, బరువు, స్టాండింగ్ జంపు, సర్జికల్ జంప్, మెడిసిన్ బాల్‌తో 30 మీటర్లు, ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సీబిలిటీ, 800 మీటర్ల పరుగు పందెం, పోటీలు నిర్వహిస్తారని జిల్లా స్థాయిలో 10 మంది బాలికలు, 10 మంది బాలురనుఎంపిక చేస్తామని ఆయన అన్నారు. ఈనెల 11న కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలోశారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు 2 లక్షల లోపు ఆదాయం, పట్టణ ప్రాంతంలో గల వారికి 1.5లక్షల లోపు ఆదాయం ఉండాలని అన్నారు. 9 లోగా రూమ్ నెంబర్ 21 ఎఫ్, ఫస్ట్ ఫ్లోర్ ఐడీఓసీ నాగర్‌కర్నూల్ కార్యాలయంనందు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు.

ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కృష్ణయ్య

వెల్దండ, మార్చి 7 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నూతన ఎంపీడీఓగా కృష్ణయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వర్తించిన ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి ఊరుకొండ మండలానికి బదిలీకాగా అక్కడ నుండి కృష్ణయ్య ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణయ్య మాట్లాడుతూ మండల ప్రజలందరికీ అందుబాటులో ఉండి గ్రామాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

ఉప్పునుంతల, మార్చి 7 ప్రభాతవార్త : ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తామని ఉప్పునుంతల సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు అన్నారు. శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉప్పునుంతలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలు తమ ఇంటిని ఎంత పరిశుభ్రంగా ఉంచుకుంటారో తమపరిసర ప్రాంతాలను అదేవిధంగా ఉంచుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి నిత్యం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ సహకారంతో గ్రామాభివృద్ధికి పాటుపడతానని, అందరి సహకారంతో అన్ని వార్డులను సమగ్ర అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి వార్డులో ఎక్కడ సమస్య ఉన్న మీ దృష్టికి వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శివెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పందులు పట్టించిన సర్పంచ్, వార్డు సభ్యులు

కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

రాజాపూర్, మార్చి7 ప్రభాతవార్త : రాజాపూర్ మండల కేంద్రంలోని 12వ వార్డులో పందులు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను పలు అనారోగ్యాల బారిన పడవేస్తున్నాయని కాలనీ వాసులు శుక్రవారం గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కావలి రామకృష్ణ, 12వ వార్డు సభ్యులు అనంతుల వెంకటేష్ దృష్టికి తీసుకుపోగా వెంటనే వారు స్పందించి శనివారం పందులు పట్టించడం పట్ల 12వ వార్డు సభ్యులు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు ఇవ్వాలి

బీఎస్పీ నియోజకవర్గ ఇంఛార్జ్ మునిస్వామి

చిన్నంబావి, మార్చి7 ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించి, అక్రిడేషన్‌లను జారీ చేయాలనిబీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి మునిస్వామి అన్నారు. శనివారం చిన్నంబావి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కొల్లాపూర్ నియోజక వర్గంలో గత కొన్ని ఏళ్లనుంచి చిన్నంబావి, కొల్లాపూర్‌తో పాటు పలు మండలాలలో జర్నలిస్ట్‌లకు కేటాయించిన స్థలాలు, ఇండ్ల నిర్మాణంలో నెలకొన్న నిర్లక్ష్యాన్ని అధిగమించాలని, ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఇండ్లను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శ్రద్ధ కనబరిచి జీతం ఎరగని సేవకులుఅయినా జర్నలిస్టులకు న్యాయం చేయాలనివారు డిమాండ్ చేశారు. చిన్నంబావిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు చేసి జర్నలిస్ట్ కాలనీ పేరుతో గతంలో ఇండ్ల నిర్మాణం చేసి స్వతహాగా లక్షల రూపాయలడబ్బులు పెట్టిన జర్నలిస్ట్‌లకు న్యాయం చేయాలని, అట్టి నిర్మాణాలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి వారికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోనీ ప్రతి మండల జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని అలాగే వారికి అక్రిడేషన్ కార్డు సైతం త్వరగా జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రిడేషన్ కార్డు జారీలో విడుదల చేసిన 252 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు న్యాయం జరగకపోతేబిఎస్పి పార్టీ ఆధ్వర్యంలో భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

టెలికం అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా పసుల నీరజ్

నర్వ, మార్చి7 ప్రభాతవార్త: టెలికం అడ్వైజరీ కమిటీ (టిఎసి)బోర్డు మెంబర్ అఫ్ ఇండియాగా నర్వ మండల ఉందేకోడ్ గ్రామ పసుల నీరజ్ అడ్వకేట్‌ను నియమించారు. శనివారం మహబూబ్ నగర్ ఎంపీ డికె అరుణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డిలు నియామక పత్రాన్ని అందజేశారు. నియామక పత్రాన్ని అందించిన ఎంపీ డీకే అరుణ నులక్ష్మి కాంత్ రెడ్డిని నీరజ్ సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నర్వ మండల ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, కోశాదికారి నాగన్న గారి యాదవ రెడ్డివావిల్ల వెంకటేశ్వర రెడ్డి, చాకలి బొజ్జన్న, నర్వ మండల మాజీ అధ్యక్షులు శ్రీధర్ శెట్టి, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రాంపురం నరసింహ, వాసా సతీష్, మున్నూరు శేఖర్, ఉందేకోడ్ బూత్‌అధ్యక్షులురమేష్, ఉంద్యాలశివ, బిజెపినాయకులు పాల్గొన్నారు.

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష

వెల్దండ, మార్చి 7 ప్రభాతవార్త: మార్చి 6వ తేదీ నుండి ప్రారంభమైన జూన్ 12వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించనున్న 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీవో కృష్ణయ్య పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కృష్ణయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేరవయ్యే విధంగా రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం మండలంలోని ప్రతి అధికారి బాధ్యత అని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సేవలు సమర్థవంతంగా అందేలా కృషి చేయాలని సూచించారు. చేయాల్సిన పనులపై ఈ కార్యక్రమంలో సర్పంచులు వార్డుసభ్యులు గ్రామస్థాయిఅన్ని శాఖల అధికారులు యువత మహిళలుఈ కార్యక్రమంలోపాల్గొనే విధంగా పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి లక్ష్మణ్, సూపరింటెండెంట్ మోహన్ లాల్, ఏపీవో ఈశ్వర్ జి, ఈసీ దేవేందర్‌తో పాటు పంచాయతీ కార్యదర్శిలు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

హెచ్‌టి పత్తి, నానో ఎరువులపై రైతులకు అవగాహన

మద్దూరు, మార్చి7 ప్రభాతవార్త: కొత్తపల్లి మండలం లింగల్ చెడు రైతు వేదికలో నారాయణపేట డివిజన్ ఆధ్వర్యంలో హెచ్‌టి పత్తి (హార్మోను టాలరెంట్) పత్తి సాగు నానో ఎరువుల వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించబడింది. కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారి కె. రమేష్ మాట్లాడుతూహెచ్‌టి విత్తనాలు పంటలకు, మట్టికి, పర్యావరణానికి, ఆరోగ్యానికి నష్టాలను కలిగించవచ్చని హెచ్చరిస్తూ, దేశంలో హెచ్‌టి విత్తనాల సాగుకు ఇంకా అధికారిక అనుమతి లేవని రైతులకు వివరించారు. లైసెన్స్ లేకుండా విత్తనాలనుసాగించడం, కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టవిరుద్ధమని గుర్తు చేసారు. రైతులు కేవలం లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర విత్తనాలు మాత్రమే కొనుగోలు చేసి, బిల్లులను భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే నానో ఎరువులను సరైన మోతాదులో, సరిగా ఉపయోగించడం వల్ల పంటలకు మట్టికి కలిగే ప్రభావాలను రైతులకువివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు జి. మోహన్ రెడ్డి, నరేష్, ప్రశాంత్ వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవంలో బ్యాంకు ఉద్యోగులు

శిశు మందిర్ విద్యార్థులకు ఆట పరికరాల అందజేత

నవాబుపేట, మార్చి 7 ప్రభాతవార్త : మహిళా దినోత్సవం సందర్భంగా నవాబుపేట మండల కేంద్రంలోని శిశుమందిర్ విద్యాలయంలో నవాబుపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళా ఉద్యోగులు, శిశు మందిర్ విద్యార్థులకు విద్యార్థులు ఆడుకోవడానికి ఆట వస్తువులు పరికరాలు అందజేశారు. మహిళా సాధికారతతో మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా రీజినల్ మేనేజర్ రమా మూర్తి మాట్లాడుతూ మహిళా సంఘాల ప్రతినిధులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలు అమూల్యమని ప్రశంసించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలపడాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో నవాబుపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్, బ్యాంకు మహిళా ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శ్రీరంగాపూర్, మార్చి7 ప్రభాతవార్త : ఎదురెదురుగా బైకులు ఒకదానితో ఒకటి ఢీకొట్టడం వల్ల ఇద్దరికీ గాయాలు కావడం జరిగింది. వివరాల్లోకి వెళితే తిప్పాయపల్లి గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఎండి షఫీ పంచాయతీ సెక్రెటరీ జ్యోతి ఇద్దరు కలిసి బుధవారం తిప్పాయపల్లి నుంచి ఎంపీడీవో ఆఫీస్ పెబ్బేరుకు వెళుతుండగా వెంకటాపూర్ గ్రామ శివారులో మధ్యాహ్నం 2:30 సమయంలో సుగూర్ కు చెందిన రాజు తన బైక్ మీద అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి వీరి ద్విచక్ర వాహనంను ఢీకొట్టగా ఇద్దరికీ గాయాలు కాగా వారు చికిత్స కోసం హాస్పిటల్‌కి వెళ్లి శనివారం షఫీ వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఏఎస్ఐ మన్యపు రెడ్డి తెలియజేయడం జరిగింది.

నర్సరీలో మొక్కలను పరిశీలించిన సర్పంచ్

గద్వాల మార్చి 7, ప్రభాతవార్త: పెద్దపల్లి గ్రామం లోని నర్సరీ లో పెంచుతున్న మొక్కలను సర్పంచ్ శిరీషరాజశేఖర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుపు మొక్కలు రాకుండా చూడాలని, నీళ్లు సరి పడే విధంగా చూసుకోవాలని సూచించారు. గ్రామం లో ప్రతి ఇంటికి మొక్కలును అందచేస్తామని, పెద్దపల్లి గ్రామం పచ్చగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలని, పెద్దపల్లి గ్రామంను మోడరన్ గ్రామంగా చేయడమేనాలక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లక్ష్మి నర్సిములు, వార్డు మెంబెర్స్ పరుశరాముడు, వెంకటేష్, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు పంపయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల తహసీల్దార్ జి శివకుమార్

వీపనగండ్ల మార్చి 7, ప్రభాతవార్త: వీపనగండ్ల మండల తహసిల్దార్ గా జి శివకుమార్ శనివారం నాడు పదవి బాధ్యతలు చేపట్టారు. ఈయన బాధ్యతలో ఉన్న తహసీల్దార్ వరలక్ష్మి శ్రీరంగాపూర్‌కు శనివారం నాడు బదిలీపై వెళ్లారు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వనపర్తి జిల్లాలో పదిమంది తహసిల్దార్లు శనివారం నాడు బదిలీ కావడం జరిగింది. ఆమె స్థానంలో నూతనంగా శివకుమార్ పదవిబాధ్యతలు చేపట్టారు ఈయన మాట్లాడుతూ తమకు తాసిల్దార్‌గా బాధ్యతలు ఇచ్చిన అధికారులకు ధన్యవాదాలు తెలుపుతూ మండలంలో వివిధ రకాల భూ సమస్యలు పరిష్కరించే అందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

దామరగిద్ద, మార్చి 7 ప్రభాతవార్త: బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్యారా లీగల్ వాలంటీర్ ఏ. రూపిక అన్నారు. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు, బాల్య వివాహాలపైవిద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహానికి చట్టబద్ధమైన వయస్సు అమ్మాయిలకు18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని సూచించారు. ఈ వయస్సు రాకముందే పెళ్లి చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్య వివాహాలు మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు, చదువు మధ్యలో ఆగిపోవడం, నిరక్షరాస్యత పెరగడం, నిరుద్యోగం, భవిష్యత్తు లక్ష్యాలు నెరవేరకపోవడంవంటి అనేక సమస్యలకు దారి తీస్తాయని వివరించారు మీ గ్రామంలో ఎవరైనా చట్టబద్ధ వయస్సు రాకముందే పిల్లల పెళ్లికి ప్రయత్నిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుండి హెచ్ పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభం

గద్వాల మార్చి7, ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లాలో ఈనెల 8వ తేదీ నుంచి హెచ్ పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నుంచి 14 సంవత్సరాల బాలికలకు ఈ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం ను గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తో పాటు అలంపూర్ క్రాస్ రోడ్ లోని వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో, అలంపూర్ సిహెచ్ సి లో ప్రారంభిస్తున్నామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 7103 మంది 14 ఏళ్ల బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. మహిళలకు గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.